# "స్వీట్ హార్ట్"

- శంకరమంచి పార్థసారధి

ప్రకాశం చకచకా పార్కువైపు నడుచుకుంటూ వెడుతున్నాడు. అతని అడుగుల్లో నిర్లక్ష్యం, మొహంలో నిరాశ, నిస్పృహ, అసహ్యం అన్నీ సమంగా ఉన్నాయి. ఆ భావాలన్నీ ఎవరిపట్లా కాదు, అతని భార్య సీత పట్ల.

''నా వెనక వీళ్ళిద్దరూ కలిసి నాటకం ఆడుతున్నారా?" అదే ప్రశ్నని మంత్రంలాగా పదే పదే వుచ్చరిస్తున్నాడు నడుస్తూ.

పార్కుకి చేరి మూలగా, ఖాళీగా ఉన్న సిమెంటు బల్లమీద కూర్చున్నాడు. జేబులోవున్న సిగరెట్ తీసి వెలిగించాడు.

పార్కులో పిల్లలందరూ ముచ్చటగా ఆడుకుంటున్నారు. పిల్లలు వెంట వచ్చిన పెద్దలు వేరే కూర్చుని ముచ్చట్లాడుకుంటున్నారు. ప్రకాశం మాత్రం తనకేం పట్టనట్లు సర్దుకు కూర్చుని ఆలోచనలో పడ్డాడు. 'అసలు తప్పు సీతది కాదు, నాది. రాఘవరావు గాడిని ఇంటికి తీసికెళ్ళి సీతకి పరిచయం చెయ్యటం తన తప్పు. ఏదో తన యజమాని, తను పనిచేస్తున్న ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టరు పెద్దమనిషి అనుకున్నాడే గాని వీళ్ళిద్దరి మధ్య ఇంత వ్యవహారం వుంటుందని తనేం కలగన్నాడా? వాడికి బుద్ధిలేక పోతే, సీత కుండక్కర్లా? వీళ్ళు ఎంతకైనా బరితెగిస్తారు. నా వెనుక ఎన్ని నాటకాలైనా ఆడతారు!

చేతిలోని సిగరెట్ క్రింద పడేసి, కసిగా తొక్కాడు.

ఆ ఊళ్ళో వున్న పెద్ద ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ అయిన రాఘవరావు వద్ద ప్రకాశం స్టెనోగా పనిచేస్తున్నాడు. ప్రకాశం సీతని వివాహం చేసుకుని రెండు సంవత్సరాలు కావస్తున్నా యింకా పిల్లలు పుట్టలేదు. అయినా యిపుడు అతడిని కలత పెడుతున్న విషయం అదికాదు.

ప్రకాశం యింకా ఆలోచిస్తూనే వున్నాడు.

''మిస్టర్ ప్రకాశం ఈ రోజు కాస్త లేటవరకు కూచోవాలోయ్. ఈ పని చాలా అర్జెంటు'' అన్నాడు రాఘవరావు ఒకరోజు.

''అలాగే సార్" అన్నాడు వినయంగా (వీడిబొంద వీడికన్నీ అర్జెంటే)

''కాఫీ ఏదైనా తీసుకుంటారా?" అన్నాడు ఫ్యాన్ కోసం బెల్ నొక్కుతూ

''అబ్బే ఏం వద్దండి" అన్నాడు మొహమాటంతో (ఇదో మెహర్బానీ !)

పని పూర్తయ్యేటప్పటికి తొమ్మిదయింది.

ప్రకాశం ఇంటికి వెడతానికి లేచాడు.

''ఉండవోయ్, నిన్ను ఇంటిదగ్గర డ్రాప్ చేస్తాను" అన్నాడు రాఘవరావు.

''అబ్బే ఎందుకండి, నేను బస్సులో వెడతాను. మీకు అనవసర శ్రమ'' (హాయిగా కారులో దింపుతే బావుండు. ఇప్పుడు ఈ బస్సులు గొడవ ఎవడు చస్తాడు)

"ఇందులోశ్రమేవుంది? నేను అటేగా వెళ్ళేది, కలిసే వెడదాం" అన్నాడు రాము తాళం వేస్తూ.

ఇద్దరు కలిసి బయటకొచ్చి రాఘవరావు 'ఫియట్' కారులో బయలుదేరారు. కారు మెత్తగా, హాయిగా పోతోంది నున్నటి తారురోడ్డుమీద.

"మీకు పెళ్ళయిందా?" అన్నాడు డ్రైవు చేస్తూ రాఘవరావు

"అయిందండి. రెండేళ్ళయింది" (కొంపతీసి వీడి తాలూకు ఎవరన్నా వున్నారేమో పెళ్ళికి)

"పిల్లలా?"

"ఇంకాలేదండి" (పెద్ద! వీడి ప్రతాపం ఏమిటో)

"మీ కెంతమంది – పిల్లలు" అన్నాడు ప్రకాశం ధైర్యం చేసి

"ఇద్దరు"

ప్రకాశం కిక్కురుమనకుండా కూర్చున్నాడు.

కారు ప్రకాశం ఇంటిముందు ఆగింది.

ప్రకాశం దిగాక, రాఘవరావు "వస్తాకోయ్- గుడ్ నైట్" అంటూ కారు ముందుకు పోనిచ్చ బోయాడు.

"భలేవారండి, ఇందాకావచ్చి, ఇంట్లోకి రాకుండా వెడతారా? రండి. అయిదు నిముషాలు కూర్చొని కాస్త టీ తాగి వెళ్ళుదురుగాని" (వీడి మొహం చూస్తే వచ్చేట్టే వున్నాడు. ఇంట్లో 'టీ' పొడుం వుందో లేదో?)

రాఘవరావు కారులోంచి దిగి, ప్రకాశంతోపాటు ఇంట్లోకొచ్చాడు. వాయిదాల పద్ధతిలోకొన్న సోఫాలో అతడిని కూర్చోబెట్టి ప్రకాశం లోనికెళ్ళాడు.

సీత అప్పుడే వంటపని ముగించుకొని, జడ అల్లు కుంటోంది.

"సీతా మా బాస్ వచ్చాడు. కాస్త టీనీళ్ళన్నా వాడి మొఖాన పొయ్యకపోతే బావుండదు. కాస్త టీ చేస్తావా?" అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

"అలాగే: మీరెళ్ళి ఆయనతో మాట్లాడు తూ కూర్చోండి. క్షణంలో తెస్తా" అంటూ జడ ముడేసు కుంటూ వంటింట్లోకి వెళ్ళింది.

ప్రకాశం మళ్ళా ముందుగదిలో కొచ్చాడు.

"నేనిప్పుడు టీ తాగనోయ్" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"అబ్బెబ్బే మీకోసం కాదండి, నాకు ఈవేళప్పుడు టీ తాగే అలవాటు అంతే" (కొంపతీసి వీడు సీతతో అన్నమాటలు విన్నాడా? వీడివి పాము చెవుల్లాగా వున్నాయే!)

తర్వాత ఇద్దరు ఆఫీసు విషయాలు మాట్లాడు కుంటూ కూర్చున్నారు.

పది నిమిషాల్లో సీత టీ కలిపి, ట్రేలో పెట్టుకుని ముందిట్లో కొచ్చింది.

అంతే! సోఫాలో కూర్చున్న వ్యక్తిని చూసి బిగుసుకుపోయింది.

రాఘవరావు సీతని చూసి కొయ్యబారిపోయాడు.

ఇద్దరూ అలా రాతిబొమ్మల్లాగా చూసుకుంటూ వుండిపోయారు.

ప్రకాశం ఇద్దరినంకా చూశాడు. ఇద్దరి పరిస్థితిని గమనించాడు. కాని అతడికేం అర్థం కాలేదు.

సీత చటుక్కున ట్రేని ప్రక్కనున్న బల్లమీద పెట్టేసి వెళ్ళబోయింది.

"సీతా, ఈయన రాఘవరావు గారని, మా యమ్.డి ఈమె నా భార్య సీతామహాలక్ష్మి" అంటూ పరస్పరం పరిచయం చేశాడు.

యాంత్రికంగా ఇద్దరూ నమస్కరించుకున్నారు.

వెంటనే సీత లోపలికి వెళ్ళిపోయింది.

రాఘవరావు మౌనంగా టీ త్రాగేసి, ప్రకాశం దగ్గర శలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

*　　　*　　　*

చీకటి పడింది. పార్కులో లైట్లు వెలిగాయి. పిల్లల సందడి ఇందాకటి కన్నా కాస్త తగ్గింది. ప్రకాశం జేబులోంచి మరో సిగిరెట్ తీసి వెలిగించాడు. వెనక్కి జారగిలపడి, జరిగిన సంఘటనలన్నీ నెమరేసుకుంటున్నాడు.

పై సంఘటన జరిగినతర్వాత చాలాసార్లు, చాలా సందర్భాల్లో సీతని తను అడిగాడు, రాఘవరావుని చూడంగానే ఎందుకట్లా అయ్యావని, కానిఆమె 'అబ్బే ఏంలేదండి, ఆయన్ని ఎక్కడో చూసినట్టుగా అనిపించింది, అంతే, అంటూ మాటమార్చింది.

కాని ఒకటి మాత్రం నిజం. వారిద్దరికి పూర్వపు పరిచయం వుంది. సీత తనవద్ద దాస్తోంది. రాఘవరావుని అడిగే ధైర్యం తనకు లేదు. రాఘవరావు మాత్రం నిండు కుండలాగా వున్నాడు. కాని తన యింటికి వచ్చిన దగ్గరనుంచి తనకో ప్రత్యేకమైన గౌరవం ఇస్తున్నట్లుగా అనిపించింది. అది సీత భర్త గానా? ఏమో!

కాని సీతలో మాత్రం చాలామార్పు వచ్చింది. ఎప్పుడూ దిగులుగా వుంటుంది.

వీళ్ళిద్దరి వెనుక ఏదో కథ వుంది. ఇంకేం వుంటుంది, వీళ్ళిద్దరూ ప్రేమించుకుని వుంటారు. పెద్దవాళ్ళు ఆమోదించలేదు, ఇద్దరూ వేరేపెళ్ళిళ్ళు చేసుకున్నారు. ఇపుడు హఠాత్తుగా కల్సుకునేసరికి పూర్వపు వాసనలు గుర్తుకొచ్చి వుంటాయి. కాని తను అడ్డం వున్నాడే ఇప్పుడు!

కొంపతీసి వీళ్ళిద్దరికి మామూలు పరిచయమేనా, లేక......చేతిలోని సిగిరెట్ అసహనంగా అవతల పారేసి, ఇంటివైపు నడకసాగించాడు ఆలోచిస్తూ.

మొదటి సంఘటనతో తనకింత అనుమానం రాక పోవచ్చు. కాని వెంటనే ఇంకో సంఘటన జరిగింది. దాంతో అనుమానం బలపడింది.

ఒకరోజు, అంటే దీపావళికి ముందురోజు, ఆఫీసు నించి తను వచ్చేస్తుంటే రాఘవరావు, "ప్రకాశం ఏమన్నా అర్జెంటు పనుందా ?" అని అడిగాడు.

"అబ్బె ఏం లేదండి" (ఏం నాయనా లేటవర్చు కూర్చోపెట్టి నన్ను దింపాలన్న సాకుతో మళ్ళీ ఇంటి దాకా రావచ్చనా ?)

''కాస్త షాపింగ్ పనుందోయ్. ఒక్కడిని పోవాలంటే బోరు. కాస్త కంపెనీ వస్తావని" అనినసిగాడు.

''అలాగేనండి. తప్పకుండా" (వెధవఫోజు వీడును!)

ఇద్దరూకల్సి బజారెళ్ళారు.

రాఘవరావు భార్యకి ఏవో చీరెలు తీసుకొంటున్నాడు.

ప్రకాశం ప్రక్కన చూస్తూ కూర్చున్నాడు.

రెండు, మూడు చీరెలు సెలక్ట్ చేసి ప్యాక్ చెయ్యమని చెప్పి, ప్రకాశం వంకచూసి, "పండక్కి నీ భార్యకి చీరె తీసుకోవా ?'' అన్నాడు.

"అబ్బె తర్వాత తీసుకుంటానండి'' (నీ సంగతి నువు చూసుకోవోయ్ పెద్దగొప్ప)

''అదేమిటోయ్, డబ్బుకావాలంటెనేనిస్తా. తీసుకో"

''అబ్బె ఎందుకండి...'' (వీకితో పెద్ద చావొచ్చి పడిందే)

''భలేవాడివి, పోనీ వూరికేవద్దంటే అప్పుగా తీసుకో. వున్నప్పుడు ఇద్దుగాని" అని ఓ కనకాంబరం రంగుచీర తీసి, షాపువాడి కిచ్చి "ఇది వేరే ప్యాక్ చెయ్యండి'' అన్నాడు.

ప్రకాశానికి అభ్యంతరం తెలిపే వ్యవధి లేక పోయింది.

బిల్లు చెల్లించి, మళ్ళీ ఇద్దరూ కారెక్కి బయలు దేరారు.

ఎవ్వరు ఏం మాట్లాడలేదు.

ఎదురుగా వస్తున్న లారీ హెడ్ లైట్స్ కాంతిలో, రాఘవరావు కంట్లో నీటిని చూశాడు ప్రకాశం.

రాఘవరావు ఏడుస్తున్నాడా! ఎందుకు?

కారు ప్రకాశం ఇంటివద్ద ఆగింది. కారు దిగిన ప్రకాశం చేతికి ప్యాకెట్ అందించి, 'గుడ్ నైట్' అంటూ కారుని ముందుకి పోనిచ్చాడు.

ప్రకాశానికి అంతా విచిత్రంగా, కోపంగా, బాధగా వుంది. ఏమిటి వీళ్ళ కథ? అంత ఘాటు ప్రేమా వీళ్ళది?

లోపలికెళ్ళిన ప్రకాశానికి, కుర్చీలో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్న సీత కనిపించింది. గబుక్కున ప్యాకెట్ ఆమె ఒళ్ళో పడేసి, అవతలి గదిలోకెళ్ళాడు విసుగ్గా.

బట్టలు మార్చుకుంటుండగా, సీతవచ్చి, ''ఈ చీర చాలా బావుందండీ. అయినా నాకు కనకాంబరం రంగంటే ఇష్టమని మీకెట్లా తెల్సు'' అంది అమాయకంగా.

''తెల్సినవాళ్ళు చెప్పారు'' (నీ ప్రియుడు రాఘవరావు చెప్పాడు) అంటూ దొడ్లోకెళ్ళాడు.

కొత్తచీర చూసి మురిసిపోతున్న సీత ప్రకాశం అన్నమాట వినిపించుకోలేదు.

ఆలోచిస్తూ నడుస్తున్న ప్రకాశం సరిగ్గా ఇంటి ముందుకొచ్చి ఆగాడు. అతడికి ఇంట్లోకి వెళ్ళాలని పించటం లేదు. అయినా మెల్లిగా కాళ్ళీడ్చుకుంటూ ఇంట్లో కడుగెట్టాడు,

సీత లోపల మంచంమీద పడుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

అతడు మౌనంగా లోనికెళ్ళి బట్టలు మార్చుకుని, వచ్చి ముందుగదిలో కూర్చున్నాడు. తర్వాత కాసే పటికి సీతవచ్చి, "రండీ అన్నం వడ్డిస్తా" అంది ఎర్ర బడిన కళ్ళతో.

"అదిసరేగాని, ఎందుకేడుస్తున్నావ్?" (రాఘవ రావుని కలుసుకోనందు కయ్యుంటుంది)

''ఏంలేదండీ, ఈరోజు మా అక్కయ్య చనిపోయిన రోజు. అది గుర్తుకొచ్చింది అంతే. రండి'' అంటూ వంటింట్లోకి నడిచింది.

ప్రకాశం మౌనంగా ఆమెని అనుసరించి భోజన కార్యక్రమం ముగించాడు,

ఆరోజు సీత రాఘవరావు కొనిచ్చిన కనకాంబరం రంగుచీర కట్టుకుంది. ఆ చీరలో ఆమెచాలా అందంగా వుంది. కాని ప్రకాశానికి ఆమె అందాలు కన్పించటం లేదు, రాఘవరావు కనబడుతున్నాడు.

ప్రకాశానికి రోజురోజుకీ అసహనం పెరిగిపోతోంది.

తన్ని అడ్డంపెట్టుకుని వీళ్ళిద్దరు నాటకం ఆడుతున్నారా?

రాఘవరావు గూడా ఈ మధ్య ఆఫీసుకి తిన్నగా రావటంలేదు. వచ్చినా కాసేపు కూర్చుని వెళ్ళిపోతున్నాడు.

వీళ్ళిద్దరూ ఎక్కడైనా కల్సుకుంటున్నారా?

కళ్ళుమూసుకుంటె, రాఘవరావు చేతిలో నలుగుతున్న సీత, ఆమెప్రక్క పడుకుంటె, సీత కళ్ళలో నవ్వుతున్న రాఘవరావు—

ఛీఛీ ఈ నరకాన్ని తను భరించలేడు. ఏదో ఒకటి చేసి ఈ అనుమానాన్ని నివృత్తి చేసుకోవాలి. కాని ఎట్లా?

ఆలోచించి, ఆలోచించి ఒకనిర్ణయాని కొచ్చాడు. ఒక మహత్తరమైన పథకం వేసాడు.

మర్నాడు ఆఫీసుకి వెళ్ళేటప్పటికి, రాఘవరావు ఇంకా రాలేదు.

చకచకా కాగితం, కలం తీసుకుని వ్రాయటం మొదలెట్టాడు.

ప్రియమైన సీతకి,

ఆనాడు నిన్ను ప్రకాశం భార్యగా మీ ఇంట్లో చూచినక్షణం, చాలా ఆనంద పడ్డాను, అంతకుమించి బాధపడ్డాను. చాలాకాలం తర్వాత నిన్ను కల్సుకున్నందుకు ఆనందం, ప్రకాశంలాంటి నిస్సహాయుడికి భార్యవైనందుకు చాలా చింతించాను. ఆనాటినించి నిన్ను కల్సుకోవాలని, మనసువిప్పి మాట్లాడాలని ఆదుర్దాగావుంది. నీపట్ల ఆనాటి నా ప్రేమ ఇంకా అలాగేవుంది. ఇంకా చెక్కుచెదరలేదు. నిన్ను కల్సుకుని చాలా విషయాలు మాట్లాడాలనివుంది. అందుకే నేను బుధవారం ఉదయం పదిన్నర గంటలకి పబ్లిక్ గార్డెన్స్ జవహర్ బాలభవన్ వద్ద ఎదురు చూస్తూ వుంటాను. తప్పక వస్తావుకదూ! ఈ విషయాలేవీ నీ భర్తకి తెలియనివ్వనని హామీ నిస్తున్నాను.

నీకోసం వెయ్యికళ్లతో ఎదురు చూస్తూ

నీ స్వీట్ హార్ట్

రాఘవరావు.

రాయటం పూర్తిచేసి, ఒకటికి రెండుసార్లు చదువుకొని, తృప్తిగా నవ్వుకుంటూ ఉత్తరాన్ని కవర్లో పెట్టి తన ఇంటి అడ్రసురాసి, పోస్ట్ చేశాడు.

ఈ దెబ్బతో తేలిపోవాలి. నిజంగా సీతకి రాఘవరావుకి తను అనుమానపడుతున్నట్టుగా సంబంధం వుంటే, సీత ఆ ఉత్తరంలో రాసిన విధంగా రావాలి.

ఒక వేళ అలాంటిదేమీ లేకపోతే, సీత కనీసం ఆ ఉత్తరాన్ని తనకి చూపించాలి.

తన తెలివితేటలకి తానే మురిసిపోయాడు.

బుధవారం దగ్గరౌతున్నకొద్దీ అతడి మనసు పురకలేస్తూంది. మంగళవారంనాడు రేపు ఆఫీసుకి ఆలస్యంగా వస్తానని రాఘవరావుకి చెప్పాడు. బుధవారం ముందుగానే బయలుదేరి ఆఫీసు వెళుతున్నానని ఒకటికి రెండుసార్లు భార్యతోచెప్పి బయటపడ్డాడు.

ఆ సమయంలో గార్డెన్స్ దాదాపు నిర్మానుష్యంగా వుంటుంది. ప్రకాశం మెల్లిగా ఒక పొదమాటుగాచేరి, సిగిరెట్ వెలిగించి, ఎదురు చూస్తూ కూర్చున్నాడు.

తను ఉత్తరం వ్రాసిన రోజునుంచి సీతలో చాలా మార్పు వచ్చింది. తనతోగూడా చాలా ముభావంగా వుంటోంది, ఎక్కువగా మాట్లాడటం లేదు.

అసలు వారిద్దరిమధ్య అటువంటిసంబంధం లేదేమో? అనవసరంగా తాను అపోహపడుతున్నాడా? మరి సీత ఆ వుత్తరాన్ని ఎందుకు చూపించలేదు.

అసలు వుత్తరం అందిందా? లేదా?

తలవిదిలించి టైము చూసుకున్నాడు, పదిన్నరైంది.

తెలిసిపోతుంది, ఇంకాకొద్ది నిముషాల్లో తేలిపోతుంది అసలుకథ.

ఆ విధంగా ప్రకాశం ఆ పొద మాటున, ఆ ఎండలో, చెమట దిగ్గారుతుండగా, సీతకోసం, తనభార్య పరపురుషుడిని కల్సుకోవటాని కొస్తుందని ధైర్యంతో, ఎదురు చూస్తూ చాలా గంటలు కూర్చున్నాడు.

కాని అతడనుకున్నట్టుగా సీత రాలేదు.

ప్రకాశానికి అంతా అయోమయంగావుంది. తిరిగి ఆఫీసుకెళ్ళినా పనేమి ముట్టుకోలేదు. సాయంత్రం కాళ్ళీడ్చుకుంటూ ఇంటికెళ్ళిన అతనికి సీత నవ్వుతూ ఎదురొచ్చింది. మౌనంగావెళ్ళి కుర్చీలో కూలపడ్డాడు.

''మీకేదో వుత్తరం వచ్చింది, అక్కడ టేబులు మీద పెట్టాను" అంది నవ్వుతూ కాఫీ అందిస్తూ.

ప్రకాశం తృళ్ళిపడి వుత్తరాన్ని అందుకొన్నాడు. కాని అది తను సీతకి వ్రాసిన ఉత్తరం కాదు. తన మామగారు తనకి వ్రాసింది. ఆయన షష్టిపూర్తి వుత్సవానికి తప్పకుండా నాలుగు రోజులు ముందుగానే

రమ్మనమని మరీమరీ వ్రాశారు. వుత్తరం చదివి. ప్రక్కన పడేసి కళ్ళు మూసుకొని కూర్చున్నాడు.

'' మావాళ్ళింటికి ఎప్పుడెడతాం?'' అందిసీత ఉత్సాహంగా. ప్రకాశం ఏమీ మాట్లాడలేదు

''రెండురోజులు ముందుగానే వెడదామండి లేక పోతే నాన్న బాధపడతాడు''

"నువ్వెళ్ళు. నేనురాను, నాకు సెలవు దొరకదు" అన్నాడు పొడిగా.

''మీ యం. డి. కి నేను రికమెండ్ చేస్తాలెండి సెలవిమ్మని'' అని గబుక్కున నాలిక కొరుక్కుంది నవ్వుతూ.

చటుక్కున తలతిప్పిచూసిన ప్రకాశానికి సీత ఏదోతప్పు చేసిన దానిలాగా నాలిక కొరుక్కోవడం కనిపించింది.అతడికి వుండుమీద కారంచల్లినట్లయ్యింది. మాట్లాడకుండాలేచి లోపలికి వెళ్ళాడు.

అతడి అనుమానం బలపడింది. అంటే అతడిదగ్గర సీతకి అంత చనువుందన్నమాట. నోరుజారి నిజం పలికేసింది. అందుకే నాలిక కొరుక్కుంది. ఈ షష్టిపూర్తి వంకతో అక్కడికివెళ్ళి మామగారితోగూడా మాట్లాడి ఈ విషయం తేల్చెయ్యాలి అని నిర్ణయి చాడు.

భార్యా భర్తలిద్దరూ షష్టిపూర్తి వుత్సవానికి ఒకరోజుముందుగా తరలి విజయవాడ వెళ్ళారు. అక్కడికి చేరేసరికి రాత్రి ఎనిమిదయింది. కుశల ప్రశ్నలు, పరామర్శలు అయినాక, భోజనాల కార్యక్రమం ముగిసాక, తండ్రీకూతుళ్ళు ఇంటిముందు ప్రదేశంలో కుర్చీలోకూర్చుని ఏదో చాలా తీవ్రంగా, మెల్లిగా మాట్లాడు కుంటున్నారు. ప్రకాశం మాత్రం తమకోసం కేటాయించిన గదిలో పడుకొని పుస్తకం చేత్తో పట్టుకొని ఆలోచిస్తున్నాడు.

ఆలోచనలో మునిగున్న ప్రకాశం, చటుక్కున ఈ లోకంలోకి వచ్చాడు. మామగారు ఎవరిమీదో గట్టిగా అరుస్తున్నారు.

"వాడు నాగడపలో అడుగు పెట్టటానికి వీల్లేదు. ఏనాడైతే కులంతక్కువదాన్ని చేసుకున్నాడో, ఆనాడే మా సంబంధం తెగిపోయింది. వాడికి ఈ ఇంట్లో స్థానంలేదు. పొమ్మను."

''నాన్నా ఆవేశపడకు. అక్కయ్యని ఎట్లాగు పొందలేక పోయావు, వున్న అన్నయ్యనిగూడా వదులుకుంటావా? ఆవేశ పడకు. నువులోనికి పద" అని సర్దబోయింది సీత.

ప్రకాశం లేవటానికి ప్రయత్నం చెయ్యలేదు. పడుకొనే బయట జరుగుతున్న రభసని ఆసక్తిగా వింటున్నాడు.

''అమ్మడూ, నువుగూడా వాడినే సమర్థిస్తున్నావా? ఈ భ్రష్టుడు ఆకులంతక్కువదాన్ని చేసుకోవటం వల్లనేగా నీ అక్కయ్య పెళ్ళి పీటలదగ్గర ఆగిపోయింది అవమానాన్ని భరించలేకేగా అదినూతి లోదూకి చచ్చిపోయింది. ఇంతజరిగాక ఇంకా వాడిని క్షమించమంటావా?" అంటున్నాడు మామగారు.

ప్రకాశానికి ఇప్పుడు కథ అర్థం అయింది. కాని సీత తనకెందుకు ఇన్నాళ్లు చెప్పలేదు? ఇంతకీ ఆవచ్చిన వ్యక్తి నోరుతెరిచి మాట్లాడటంలేదు. ఎంచేత? పాపం తండ్రినిచూసి భయపడి వుంటాడు అనుకున్నాడు.

బయట ఈలోగా చాలాజరిగాయి మామగారు ఏడ్వటం, సీత ఓదార్చి, ఆయన్ని ఇంట్లోకి తీసికెళ్ళడంతో అక్కడి వాతావరణం చల్లబడింది.

మొత్తానికి ముసలాడు తగ్గాడు అనుకున్నాడు పడకున్న ప్రకాశం. ఇంకా బయటనుంచి మాటలు వినబడుతూనే వున్నాయి బహుశా అన్నాచెల్లెళ్ళు మాట్లాడు కుంటున్నారేమో అనుకున్నాడు.

"నువు వస్తావోరావో అని దిగులుపడి పోయాననుకో. వచ్చేముందు నీకు ఫోను చేసా. నువులేవని అన్నారు. అందులో ఈయనికి తెలియకూడదు'' అంటూంది సీత.

''అదేమిటి ప్రకాశానికి మన గురించి చెప్పలేదా?'' అన్నాడు సీతన్నయ్య. ప్రకాశం గుండె జల్లుమంది. ఆ కంఠం తనకు పరిచయమే. నిత్యం తను వినేది, తనకు ఆర్డర్లు జారచేసేది. ఆ గొంతు ఎవరిదో కాదు, తన యమ్. డి. రాఘవరావుది.

అంటే రాఘరావు సీతకి అన్నయ్య!

''నువు పెళ్ళిచేసుకు వెళ్ళాక, అక్కయ్య చావుతో నాన్న చాలా కుంగి పోయాడు. ఇంకా ఈ విషయం బయటకి తెలిస్తే ఏం ఘోరాలు జరుగుతాయోనని, ఎవ్వరికి చెప్పనని నాన్న నాచేత ప్రమాణం చేయించు కున్నాడు. అందుకే ఆయనకి గూడా మనిద్దరి గూర్చి ఈక్షణం వరకు తెలియదు' గడగడ చెప్పుకు పోతున్నది సీత.

''అలాగా! అయితే ప్రకాశం బావగార్కి నేనే చెబుతా. బావగారూ బయటకి రండి, మీకో శుభవార్త చెప్పాలి'' అని పిలిచాడు రాఘవరావు. ప్రకాశం కదల కుండా అట్లాగే పడుకున్నాడు.

"నా స్వీట్ హార్ట్‌కి సిగ్గెక్కువన్నయ్యా. వుండు నేను పిల్చుకొస్తా'' అంటోంది సీత.

ప్రకాశానికి తెల్సు సీతలోపలికొస్తుంది. కాని ఆమె మోహం లోకి ఆమె కళ్ళలోకి చూడలేడు. తను సీత పట్ల చాలా నీచంగా ఆలోచించాడు. వాళ్ళముందుకి తనుపోలేడు. అందుకే కళ్ళుమూసుకొని నిద్ర పోతు న్నట్లుగా తలగడలో మొహాన్ని దాచుకొని పడుకు న్నాడు ప్రకాశం.

* * *

అన్యాయం అత్యాచారం చేసే వాడికంటే
దాన్ని సహించే వాడే దోషి.

—తిలక్.